నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 1
సోమవారం 05 జూన్ 2023

పేద ప్రజల ఇంటి స్థలాలపై నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

- విజయవంతం చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్న పేద ప్రజల ఇంటి స్థలాలపై నేడు అనగా సోమవారం పెద్ద ఎత్తున కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కలెక్టరేట్ సమీపంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూ పోరాటంలో ఆదివారం కురిసిన భారీ వర్షంలో సైతం ప్రజలు తమ చంటి పిల్లలను చంకనెత్తుకొని తమ ఇంటి స్థలాల కోసం పోరాటంలో ముందు నిలిచారని తెలిపారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా పేదల సమస్యలను అర్థం చేసుకొని ఇంటి స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కావున నేడు ఉదయం 11 గంటలకు ఇంటి స్థలాల కోసం పేద ప్రజలు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



నవతెలంగాణ-గాంధారి

మండలంలోని ముద్దెల్లి గ్రామంలో కుస్తీ పోటీలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో కుస్తీపోటీలు కొబ్బరికాయ కుస్తీ మొదలుకొని వెండికడియాల కుస్తీవరకు పోటీలు నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో పాల్గొనడానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుండే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి మల్లయోధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కుస్తీ పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు గ్రామ సర్పంచ్ పిట్ల కళావతి లక్ష్మణ్ నగదు, వెండి కడియాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో

తెలంగాణ పోలీస్ నెంబర్ వన్

- సురక్షా దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- జిల్లా కేంద్రంలో పోలీసు వాహనాలతో భారీ ర్యాలీ
- పాల్గొన్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు, మేయర్
- ఆకట్టుకున్న ఓపెన్ హౌజ్ కార్యక్రమం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు



ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది

నవతెలంగాణ-కంఠేశ్వర్

శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు దేశంలోనే నెంబర్ వన్‌గా నిలుస్తున్నారని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సురక్షా దినోత్సవం నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్ శాసన సభ్యులు బిగాల గణేష్ గుప్తా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఆర్మూర్ శాసన సభ్యులు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, నగర మేయర్ నీతూ కిరణ్, అదనపు డీసీపీ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు. నేరాల నియంత్రణ, మెరుగైన పోలీసింగ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖకు సమకూర్చిన పెట్రో కార్స్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో పోలీస్ సిబ్బంది నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ఇతర అతిథులు జెండా ఊపి హెడ్ క్వార్టర్స్ నుంచి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఎన్టీఆర్ చౌరస్తా, కలెక్టరేట్ గ్రౌండ్, ఓల్డ్ ఎల్‌ఐసీ చౌరస్తా, పులాంగ్ చౌరస్తా, రాజరాజేంద్ర థియేటర్ చౌరస్తా, వర్ని రోడ్డు చౌరస్తా, ఖిల్లా రోడ్, బోధన్ బస్టాండ్, నెహ్రూ పార్క్, గాంధీ చౌక్, న్యూ బస్టాండ్, రైల్వే స్టేషన్ మీదుగా ర్యాలీ తిరిగి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు చేరుకుంది. పోలీస్ వ్యవస్థ పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఉపయోగించే అధునాతన సాధనాలు, ఆయుధాల గురించి సవివరంగా తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన ఓపెన్‌హౌస్ కార్యక్రమం అందరినీ ఆకర్షించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే శాంతి భద్రతలు నెలకొని ఉండడం ఎంతో అవసరమని అన్నారు. అప్పుడే పర్యాటకపరంగా, పారిశ్రామికంగా పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలు ఉంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు, సమకూరుస్తున్న అధునాతన వసతులతో తెలంగాణ పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు అహరహం శ్రమిస్తున్నారని అన్నారు. ఫలితంగా తెలంగాణ రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని హర్షం వెలిబుచ్చారు. నేటి సమాజంలో కొత్త కొత్త పద్ధతుల్లో నేరాలు చోటు చేసుకుంటుండగా, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పోలీసులు సైతం నేరాల నియంత్రణకు విశేషంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. తెలంగాణలో పటిష్టమైన వ్యవస్థతో కూడిన కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం యావత్ దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తోందని కలెక్టర్ అభినందించారు. అన్ని వర్గాల ప్రజలకు పూర్తిస్థాయిలో భద్రతను కల్పిస్తూ శాంతిభద్రతలు నెలకొని ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పోలీస్ శాఖకు అధునాతన సదుపాయాలను సమకూరుస్తోందన్నారు. ఇందులో భాగంగానే పెట్రో కార్స్, బ్లూ కోల్ట్స్, జిల్లా స్థాయిలోనూ కమాండ్ కంట్రోల్ స్టేషన్స్, షీ టీమ్స్, భరోసా సెంటర్స్ వంటివి శాంతిభద్రతల పరిరక్షణకు ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తున్నాయని అన్నారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా హరితహారం వంటి ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల్లో క్రియాశీలకంగా మమేకం అవుతున్నారని, అనేక సామాజిక కార్యక్రమాల్లోనూ భాగస్వాములు అవుతున్నారని అన్నారు. అనునిత్యం 24 గంటల పాటు విధి నిర్వహణలో నిమగ్నమై ఉంటూ పోలీసులు అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవని ప్రశంసించారు. జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. తెలంగాణ పోలీసులు యావత్ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్నారని అన్నారు. కోవిడ్ సంక్షోభం సమయంలోను తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోలీసులు ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతికి పోలీసులు వెన్నుముకగా నిలుస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలోని నలుమూలలలో ఎక్కడ ఏ చిన్న నేరం జరిగినా, నిమిషాల వ్యవధిలోనే పోలీసులు అక్కడికి చేరుకొని క్లిష్టమైన కేసులను సైతం వెనువెంటనే చేదిస్తూ నేరస్తుల ఆటకట్టిస్తున్నారని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ సింగపూర్, స్కాట్లాండ్, దుబాయ్ దేశాల తరహాలో స్థానిక పోలీస్ యంత్రాంగానికి అధునాతన సదుపాయాలను సమకూరుస్తోందని అన్నారు. ఇతరులకు వెలుగులు పంచుతూ కరిగిపోయే కొవ్వొత్తి తరహాలో పోలీసులు పండుగల సమయంలోనూ తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ, అనుక్షణం శాంతిభద్రతల పరిరక్షణ విధుల్లో నిమగ్నమై ఉంటున్నారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ పోలీసులను గౌరవిస్తూ, వారు రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వహించేలా సహకారం అందించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

ముమ్మరంగా రిజర్వాయర్ పనులు

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు పరిశీలన



పనుల వివరాలు తెలుసుకుంటున్న స్పీకర్

నవతెలంగాణ-వర్ని

మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను తెలంగాణ రాష్ట్ర శాసన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులు షెడ్యూల్ ప్రకారం ముమ్మరంగా జరుగుతున్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 22లో భాగమే సిద్దాపూర్ రిజర్వాయర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పనులను పూర్తి చేసి రైతులకు నీళ్లు అందిస్తామని పేర్కొన్నారు. రిజర్వాయర్ నిర్మాణంతో 14,000 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. జూన్2 నాటికి తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి తొమ్మిది సంవత్సరాలు పూర్తయి పదవ సంవత్సరంలోకి అడుగు పెట్టిందని తెలిపారు. తొమ్మిది సంవత్సరాలలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించడానికే ఈ అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతు ప్రభుత్వంగా ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. రైతుల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తిగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు అండగా ఉంటున్నారని అన్నారు. రైతులకు అవసరమైన కరెంట్ సరఫరా, సాగునీరు అందించడం, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడం, మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై అమెరికాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే గ్లోబల్ అవార్డు వచ్చిందని తెలిపారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏడవ రోజు సాగు నీటిపై ప్రతిష్టాత్మకమైన సాగు నీటిపై స్పష్టత ఇవ్వనున్నట్టు తెలిపారు. మారుమూల గిరిజన తాండ రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రిజర్వాయర్ నిర్మాణానికి ముఖ్యమంత్రిని ఒప్పించి గిరిజన రైతులు మూడు పంటలు పండించుకునేలా రిజర్వాయర్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీలక్ష్మి వీర్రాజు, జెడ్పీటీసీ హరిదాస్, ఏఎంసీ చైర్మన్ కవిత అంబర్ సింగ్, వైస్ చైర్మన్ గోపాల్, మండలాధ్యక్షులు గిరి, సర్పంచ్ కల్లాబాయ్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో ఒకరు మృతి

- తోటలో చెట్టుకింద ఉండగా పడిన పిడుగు
- తీవ్ర గాయాలై మృతి
- మోర్తాడ్ మండల కేంద్రంలో ఘటన

వివరాలు మెయిన్‌లో..

భారీ వర్షం

- వీచిన భారీ ఈదురుగాలులు
- భారీ ఉరుములు, మెరుపులు
- లోతట్టు ప్రాంతాలు జలమయం



కంఠేశ్వర్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వర్షం



కంఠేశ్వర్ : హౌసింగ్ బోర్డు కాలనీలో వాహనాలపై పడ్డ చెట్టు



సదాశివనగర్ : పక్కకు వాలిన కోక

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. భారీ ఈదురుగాలులు వీచాయి. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు అక్కడక్కడ చెట్లు విరిగిపడ్డాయి. దీంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

నిజామాబాద్, పిట్లం, బిచ్కుంద, వర్ని, రుద్రూర్, బాన్సువాడ, లింగంపేట్, ధర్పల్లి తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. మరొపక్క వాతావరణం చల్లబడడంతో ప్రజలు వేసవి ఉక్కపోత నుంచి కొంత ఉపశమనం పొందారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సుమారు రెండు గంటల పాటు వర్షం కురిసింది. ఈ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని చంద్రశేఖర్, కెనాల్‌కట్ట, మాలపల్లి, అర్సపల్లి, కేసీఆర్ కాలనీ, కంఠేశ్వర్, ఆర్యనగర్, గాయత్రినగర్‌లో రోడ్ నెంబర్ 4, తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది నెలకొంది. అలాగే రైల్వే కమాన్ వద్ద పాత బ్రిడ్జి కొత్త బ్రిడ్జి కింద నీరు ఆగిపోవడంతో కొద్దిసేపటి వరకు అక్కడ రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే నూతన కలెక్టరేట్ ప్రాంతంలో సైతం లోతట్టుగా ఉండడంతో నీరు నిలిచిపోయింది. అలాగే రైల్వేస్టేషన్‌లో, బస్టాండ్ ఆవరణంలో రోడ్లన్నీ నీటితో జలమయమయ్యాయి.



సదాశివనగర్ : రోడ్డుపై ఒరిగిన చెట్టుకొమ్మలు

వర్షానికి కుప్పకూలిన భారీ చెట్టు..

నిజామబాద్ నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ఈదురుగాలులకు భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ఆ చెట్టు కింద నిలిపి ఉంచిన మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన శ్రీనివాస్ కారు పూర్తిగా ధ్వంసం అయింది. మరో రెండు వాహనాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

సదాశివనగర్ : మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో అకాల వర్షానికి కరెంట్ స్తంభాలు నేలకూలాయి. దీంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. పద్మాజివాడి చౌరస్తా నుంచి బాన్సువాడకు వెళ్ళే రహదారిలో స్ప్రింగ్ ఫీల్డ్ స్కూల్ సమీపంలో చెట్టు రోడ్డుపై విరిగిపడింది. దీనితో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ట్రాక్టర్‌తో చెట్ల కొమ్మలు తీయించారు. వాహనాలకు అంతరాయం లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. పద్మాజివాడి చౌరస్తాలో గాలివానకు చిరు వ్యాపారి కోక ఎగిరిపోయింది. ఆ కోక వద్దనున్న రెండు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. మరికొందరివి సైతం రేకులు ఎగిరిపోయాయి.

సాలూరలో బాలికకు డెంగ్యూ

- పత్తాలేని ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం


నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఓ బాలిక (11)కు గత వారం రోజుల క్రితం జ్వరంగా ఉండడంతో బాలిక తల్లిదండ్రులు బోధన్ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో పిల్లల వైద్యునికి చూపించారు. దాంతో ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం డెంగ్యూగా నిర్ధారించారు. బాలికకు ప్లేట్లెట్స్ శాతం పడిపోవడంతో గత వారం రోజులుగా అదే ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. నిరుపేద కుటుంబమైన బాలిక తల్లిదండ్రులు అప్పులు చేసి రూ.30వేల వరకు వెచ్చించారు. అయినా బాలికకు జ్వరం తగ్గలేదు. దాంతో ఆసుపత్రి ఖర్చులు భరించలేక ఆసుపత్రి నుంచి బాలికను ఇంటికి తీసుకొచ్చారు. అయినా ఇంతవరకు బాలిక కుటుంబాన్ని పట్టించుకున్న వారు లేరు. ప్రభుత్వం ఘనంగా పారిశుధ్య వారోత్సవాలు నిర్వహించిన పారిశుధ్య సక్రమంగా నిర్వహించడం లేదని, కనీసం పిచ్చి మొక్కలు తొలగించకుండా మమ అనిపించారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అలాగే దోమల వ్యాధుల నుంచి ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్రతి శుక్రవారం ఫ్రైడే- డ్రైడే నిర్వహించాలని ఆదేశాలు ఉన్నా, సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది దానిపై దృష్టి సారించడం లేదు. కనీసం కాలనీలలో పరిశుభ్రతపై , దోమల నివారణపై ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. నిరుపేద కుటుంబం అయిన బాలిక కుటుంబీకులు ఏం చేయాలో అర్థం కాక ఇబ్బంది పడుతున్నారు. సాలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఇప్పటికైనా స్పందించి కాలనీలో వైరల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, బాలికను తక్షణమే నాణ్యమైన వైద్య సేవలు అందించి ఆదుకోవాలని బాలిక కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యం

- ప్రపంచ సైకిల్ దినోత్సవ సందర్భంగా సైకిల్ ర్యాలీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న పేపర్ డిస్ట్రిబ్యూటర్స్

సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చునని పలువురు అన్నారు. నిజామాబాద్ అర్బన్ న్యూస్ పేపర్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ బస్టాండ్ నుంచి పాత కలెక్టరేట్ మీదుగా జిల్లా కోర్ట్ నుంచి తిరిగి బస్టాండ్ చేరుకుంది. ర్యాలీని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు వనమాల సత్యం, నగర అధ్యక్షులు రణం రవీందర్ గౌడ్, రిటైర్డ్ జడ్జ్ కృష్ణ గోపాల్ రావు, మాజీ నగర అధ్యక్షులు తుకారాం, దూస రవి కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ సైకిల్‌ని మరిచి పెట్రోల్ వాహనాలు నడపడం మూలంగా పర్యావరణ కాలుష్యం, అనారోగ్య సమస్యలతో పాటు అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు పెడుతున్నారని, ఇది భవిష్యత్ తరాలకు అత్యంత హానికరమని తెలిపారు. సైకిల్ తొక్కడం వల్ల గుండె జబ్బులతో పాటు షుగర్, అధిక రక్త పోటు వంటి వాటి నుంచి విముక్తి కలిగించి, ఎటువంటి వైద్య ఖర్చులు లేకుండా ఉచితంగా ఆయురారోగ్యాలతో జీవించవచ్చునని తెలిపారు. ప్రస్తుతం భారతదేశంలో కేవలం శారీరక శ్రమ లేకపోవడం వల్ల 60 శాతం మరణాలు సంభవిస్తున్నాయని వారన్నారు. పర్యావరణాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు గానూ ప్రభుత్వం సైక్లింగ్ వాడకాన్ని ప్రోత్సహిస్తూ అందుకు గానూ తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ర్యాలీలో 'సైకిల్ తొక్కండి-ఆరోగ్యాన్ని కాపాడుకోండి. సైకిల్ తొక్కండి-పర్యావరణాన్ని కాపాడండి' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు కె.రాజ్‌గోపాల్, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీకాంత్, కోశాధికారి కె.శంకర్, మధుసూదన్, సుధాకర్, శివ, బాలరాజ్, కళ్యాణ్, రమణ, శ్రవణ్, అన్ని దినపత్రికల డిస్ట్రిబ్యూటర్స్ పాల్గొన్నారు.

భర్త ఆగడాలు భరించలేక హత్య

నవతెలంగాణ-మోపాల్

ఆగడాలను భరించలేక భార్య తన భర్తను హత్య చేసింది. ఈ ఘటన మోపాల్ మండలంలోని న్యాల్‌కల్ గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ సురేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. న్యాల్‌కల్ గ్రామానికి చెందిన కట్టకింది రమేష్ (44) మద్యానికి బానిసై తరచూ తన భార్య స్వరూపతో పాటు తన ఇద్దరు పిల్లలను తరచూ కొట్టేవాడు. పలుమార్లు భార్య తన కుల పెద్దల ముందు పంచాయతీ పెట్టినా ఎటువంటి మార్పురాలేదు. చివరికి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ అతనిలో ఎటువంటి మార్పు రాలేదు. ఇదిలా ఉండగా.. శనివారం రాత్రి మళ్లీ మద్యం తాగి ఇంటికి వచ్చిన రమేష్ తన భార్య, పిల్లలపై దాడి చేశాడు. దీంతో పిల్లలను తీసుకుని స్వరూప బయటకి వెళ్ళింది. తన భర్త రమేష్ చేస్తున్న మానసిక, భౌతిక దాడులను భరించలేక శనివారం అర్ధరాత్రి సమయంలో తన ఇంటి దాబాపైన నిద్రిస్తున్న తన భర్త రమేష్‌పై బండ రాయితో తలపై మోది హత్య చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



హత్యకు గురైన రమేష్

ఇందూరు తిరుమలలో ఏరువాక పౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని నర్సింగపల్లి గ్రామంలోగల ఇందూరు తిరుమల క్షేత్రంలో ఏరువాక పౌర్ణమి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదటగ స్వామి వారిని పల్లకిలో ఆలయ పంట భూముల్లోకి తీసుకవచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం ఎద్దులకు, నాగలికి ఇతర పనిముట్లకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగ ఆచార్య గంగోత్రి రామానుజ దాసు స్వామి మాట్లాడుతూ.. ఇందూరు తిరుమలలో ఇందూరు అన్నమయ్య నర్సింహ రెడ్డి ఆధ్వర్యంలో ప్రకృతి సేద్యం ఎంతో బాగా జరుగుతుందని కొనియాడారు. కార్యక్రమంలో ఆచార్య గంగోత్రి రామానుజదాసు స్వామి వారితో పాటు, ఇందూరు అన్నమయ్య నర్సింహారెడ్డి, ప్రముఖ సినీ నటులు, న్యాయవాది నరసింహారావు, రవిందర్ యాదవ్, నరాల సుధాకర్, నర్సారెడ్డి, లక్ష్మీ, రమేష్, మురళి, ప్రసాద్, నరేష్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

బీజేపీ నేత ధన్‌పాల్‌కు పరామర్శ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని మార్వాడి గల్లీలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణను వారి నివాసంలో మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ పి నరహరి పరామర్శించారు. ఇటీవలి కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న ధన్పాల్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా కొంతసేపు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. నరహరి మాట్లాడుతూ.. ధన్పాల్ వ్యక్తిగతంగా మంచి మిత్రుడని అన్నారు. వారి సామాజిక సేవ పేద ప్రజలకు అవసరమని కొనియాడారు. ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలపైన ఆరా తీశారు. కార్యక్రమంలో ధనపాల్ వినయ్ కుమార్ దస్ పాల్ మణిమాల వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

సీఎం పర్యటన నేపథ్యంలో..

ముందస్తు అరెస్టులను ఖండిస్తున్నాం

- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు**
- **పీడీఎస్‌యూ, సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకుల ఖండన**

నవతెలంగాణ-కంఠేశ్వర్

ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మల్ జిల్లా పర్యటన ఉన్నందున నిజామాబాద్ జిల్లాలో సీపీఐ(ఎం) నాయకులను ఆదివారం ముందస్తు అరెస్టులు చేస్తూ అదుపులోకి తీసుకోవటం సరైంది కాదని జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఎన్ని అవస్థలు పడుతున్నారో.. ఏందో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు అలాంటప్పుడు ఇలాంటి అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నగరంలోని మూడవ టౌన్ పోలీసులు ఉదయమే తమ ఇంటికి వచ్చి ముందస్తు అరెస్టు చేసినట్టు తెలిపారు. అరెస్టు చేసిన వారందరినీ షరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్మూర్ :అక్రమ అరెస్టులతో ఉద్యమాల ను ఆపలేరని డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ ఆదివారం అన్నారు. సీపీఐ(ఎం)డివిజన్ కార్యదర్శి వెంకటేష్ ముందస్తు అరెస్ట్ చేయటం సిగ్గుచేటని అన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ప్రజా సమస్యల పట్ల దృష్టి పెట్టాలని అన్నారు పేదల సమస్యలను పరిష్కారం చేయాలని, ఇలాంటి అరెస్టులు చేస్తే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, పేదలు వేసుకున్న ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, అవుట్సోర్సింగ్ కార్మికులకు పెండింగ్లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని నిర్మాణాలు పూర్తైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు పంచాలని, వానాకాలం ప్రారంభం అవుతున్న సందర్భంగా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిజామాబాద్‌సిటీ :పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్‌ను అరెస్ట్ చేసి నిజామాబాద్ నగరంలోని ఫోర్త్ టౌన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ యూనివర్సిటీలో వివాదాలను పరిష్కరించడంలో, అవినీతి వీసీ పై చర్యల విషయంలో నిర్మల్ జిల్లా పర్యటనలో యూనివర్సిటీ సెగ తలుగుతుందని నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా హాస్టల్స్, ఇండ్లలో రెక్కీ నిర్వహించి పిడిఎస్‌యూ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేశారని అన్నారు.యూనివర్సిటీ పాలక మండలి సమావేశాలు జరుపుతున్నారు.. తీర్మానాలు చేస్తున్నారు.. కానీ వాటిని అమలు చేయడం లేదని అన్నారు. ఇప్పటికైనా అవినీతి వీసీ పై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని , జిల్లా వ్యాప్తంగా అరెస్ట్ చేసిన పిడిఎస్‌యూ నాయకులను విడుదల చేయాలని కోరారు.

నిజామాబాద్‌సిటీ:సీఎం కేసీఆర్ పర్యటనను అడ్డుకుంటారని భయంతో ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేయడం, నిర్బంధించడం సరికాదని సీపీఐఎంఎల్ ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. ప్రశ్నించే గొంతులను ప్రశ్నించకుండా చేయడానికి ముందస్తు పేరుతో అరెస్టు చేస్తున్నారని అన్నారు. వెంటనే అరెస్టు చేసినటువంటి నాయకులను బేషరతుగా విడుదల చేయాలని పి డిఎస్ యు నగర అధ్యక్షులు ఎస్కే అషుర్ డిమాండ్ చేశారు.

నవీపేట్ :ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మల్ పర్యటన సందర్భంగా సీపీఐ(ఎం), బీజేపీ, బీజేవైఎం నాయకులను ముందస్తు అరెస్టు చేయడం అమానుషమని అన్నారు. మండల కార్యదర్శి నాయక్ వాడి శ్రీనివాస్, బిజెపి జిల్లా నాయకులు పుట్ట శ్రీనివాస్ గౌడ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు పిల్లీ శ్రీకాంత్‌ను పోలీసులు శనివారం ముందస్తు అరెస్టులు చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారిని అరెస్టులతో భయపెట్టలేరని అన్నారు.



సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శిని అరెస్టుచేసిన పోలీసులు

నేడు నియోజకవర్గస్థాయి విద్యుత్ వారోత్సవాలు

హాజరుకారున్న రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్ర శివారులోని లలిత గార్డెన్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నియోజవర్గ స్థాయి విద్యుత్ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఎంపీపీ, జెడ్పిటిసి, బాల్కొండ సమన్వయ కమిటీ సభ్యులు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పిఎసిఎస్ చైర్మన్‌లు, డైరెక్టర్లు, గ్రామ సమన్వయ సమితి అధ్యక్షులు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, వార్డు మెంబర్లు, రైతులను తరలించాలని కోరారు.

సత్య సాయిబాబా శతజయంతి వేడుకలు

రథ యాత్రలో పాల్గొన్న భక్తులు



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

నవతెలంగాణ-ధర్పల్లి

భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శతజయంతి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో సాగిన రథయాత్రలో భక్తులు భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు. రథయాత్ర ఆదివారం మండలంలోని దుబ్బాక, రేకులపల్లి గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. మధ్యాహ్నం మండలబకేంద్రానికి చేరుకున్న సందర్భంలో ధర్పల్లి సత్యసాయి సమితి సభ్యులు మంగళహారతులతో స్వాగతం పలికారు. భజనలధ్య రథయాత్ర కొనసాగుతుంది, ధర్పల్లి సొసైటీ నుండి పురవీధుల్లో యాత్ర సాయిబాబా ట్రస్ట్ కు చేరుకుంది. జిల్లాలోని 25 గ్రామాల్లో ఇప్పటి వరకు యాత్ర కొనసాగిందని మండల కన్వీనర్ మల్లరి శ్రీనివాస్ తెలిపారు తెలియపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి ప్రభాకర్, చైర్మన్ సత్యసాయి సేవ ట్రస్ట్-ఈశ్వర్, జిల్లా ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ ఎస్ మంజుల, పూజిత, కుసుమకుమారి, శంకర్, నారాయణ గౌడ్, ధర్పల్లి సత్యసాయి సేవ సమితి సభ్యులు , బుచ్చన్న, శంకర్, జ్యోతి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సెంట్రల్ లైటింగ్, డివైడింగ్ ప్రారంభం



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం 6గంటలకు సెంట్రల్ లైటింగ్‌ను రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రారంభిస్తారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ తెలిపారు. రూ.5 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డివైడింగ్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. డివైడింగ్‌లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి లైట్లను బిగించారు. డివైడింగ్ మధ్యలో మట్టిని నింపి మొక్కలను ఏర్పాటు చేశారు. మొక్కలకు నీటిని అందించేందుకు డ్రిప్ పైపులను బిగించారు. సెంట్రల్ లైటింగ్, డివైడింగ్ ప్రారంభానికి టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ విజయోత్సవ సభలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం విద్యుత్ విజయోత్సవ సభలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. శాసనసభా నియోజకవర్గాల వారీగా సమావేశాలను నిర్వహించనున్నారు. ప్రతి గ్రామం నుండి రైతులు, వివిధ వర్గాల ప్రజలను సమీకరించేలా చర్యలు తీసుకున్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్-కమ్మర్పల్లి మార్గంలో గల లలితా గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జరిగే సభకు రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విచ్చేయనున్నారు. మిగతా నియోజకవర్గ కేంద్రాల్లోనూ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు. విద్యుత్ రంగంలో తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో నెలకొని ఉన్న పరిస్థితులు, స్వరాష్ట్రంలో సాధించిన విద్యుత్ విజయాల గురించి వివరించనున్నారు. ముఖ్యంగా వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో సాగు రంగానికి ఉచిత విద్యుత్ రూపేణా చేకూరుస్తున్న లబ్ది గురించి, నాణ్యమైన విద్యుత్ ను అందించేందుకు నూతనంగా నెలకొల్పిన సబ్ స్టేషన్లు, ట్రాన్స్ఫార్మర్లు, ఎస్సీ, ఎస్టీలు, నాయి బ్రాహ్మణులు తదితర వర్గాల వారికి అందిస్తున్న ఉచిత కరెంటు, పారిశ్రామిక రంగానికి రాయితీలు తదితర విషయాల గురించి ప్రజలకు వివరించనున్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా విద్యుత్ విజయోత్సవ సభలను విజయవంతం చేసేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేశారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా నందాల శంకర్



నియామకపత్రం అందజేస్తున్న సంఘ అధ్యక్షులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని వివేకానంద నగర్ కాలనీ 47వ తర్ప పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా నంద్యాల శంకర్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో శంకర్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగర పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుజ్జేటి వెంకట్ నర్సయ్య శంకర్‌కు నియామక పత్రం అందజేశారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దీకొండ యాదగిరి, పుల్గం హన్మాండ్లు ,మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి, జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కోశాధికారి సిలివేరి గణేష్, పద్మశాలి ఆత్మీయ సేవా సమితి అధ్యక్షుడు రాపెల్లి గురుచరణ్, నగర పద్మశాలి సంఘం సంయుక్త కార్యదర్శి బింగి మోహన్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించండి

- **నగరంలో 40 వేయిల మందికి ఆసరా పింఛన్లు**
- **అన్ని ప్రాంతాలతో సమానంగా నాగారాన్ని అభివృద్ధి చేశాం**
- **10, 11 డివిజన్ల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త

నవతెలంగాణ-కంఠేశ్వర్

ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త అన్నారు. నాగారంలోని 10, 11 డివిజన్ల టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గత నాయకులు తీరు వల్ల అభివృద్ధి నాగారం ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. 2014 లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్, కవితక్క సహకారం తో నాగారాన్ని అభివృద్ధి చేసామన్నారు. నాగారం అన్ని వైపులా డబుల్ రోడ్డు నిర్మించామని కాలనీ లో రోడ్లు, డ్రైనేజిలు నిర్మించామని, నాగారం నీటి సమస్యను తీర్చడానికి 2 కోట్ల రూపాయలతో ఫీడర్ లైన్ వేసి ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తున్నామని తెలిపారు. నాగారంలో ఏడు గురుకుల పాఠశాలలు నిర్మిస్తున్నామని, ఒక్క పాఠశాల 20 కోట్లతో నిర్మిస్తున్నామని చెప్పారు. బాబాన్ సాబ్ పహాడి వద్ద కొత్త వంతెన నిర్మిస్తున్నామని తెలిపారు. మరోసారి నాకు అవకాశం ఇవ్వండి నాగారాన్ని ప్రత్యేక నిధులతో మరింత అభివృద్ధి చేస్తానని మాటిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, దండు శేఖర్, కార్పొరేటర్ బొడిగం కోమల్ నరేష్, సిర్ప రాజు, బాబ్ల్యూ ఖాన్, సాయి వర్ధన్, చంద్రకళ, ముక్తర్, పవార్ పండరీ, సుధాకర్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

తక్షణమే విడుదల చేయాలి

డిటిఎఫ్ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ముందస్తుగా విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజా సంఘాలు రాజకీయ పార్టీల నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిటిఎఫ్ నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షులు శంతన్, జిల్లా అధ్యక్షులు బాలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన్నలు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి నిర్మల్ జిల్లా పర్యటన సందర్భంగా సరిహద్దు జిల్లా అయిన నిజామాబాద్ జిల్లాలో పలువురు విద్యార్థి, యువజన సంఘాల, ప్రజాసంఘాల, రాజకీయ పార్టీల నాయకులను అరెస్టు చేశారని తెలిపారు. తెలంగాణ ఏర్పాటైన ఈ తొమ్మిదేళ్ల కాలంలో ఎంతో ఘనమైన అభివృద్ధి సాధించామని, ఈ దేశంలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శవంతంగా నిలిచిందని గొప్పలు చెప్పు కునే రాష్ట్ర ప్రభుత్వం అదే నిజమైతే రాష్ట్ర ప్రజలు ఈ ప్రభుత్వాన్ని అక్కున చేర్చుకునేవారని, అది జరగడం లేదని, హక్కుల్ని సాధించుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడానికి అనేక రకాల ఉద్యమాలు ఇందిరా పార్క్ వద్ద, వివిధ జిల్లా కేంద్రాలలో నిరంతరం జరుగుతుండడం ప్రభుత్వ వైఫల్యాన్ని తెలియజేస్తున్నదని పేర్కొన్నారు. ముందస్తు అరెస్టులు చేసి ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడం బట్టి చూస్తే అభివృద్ధి ఏమాత్రం జరగలేదన్నది నగ్నసత్యమని తెలిపారు. పోలీసు పడగనీడలో ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టడం ద్వారానే ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే నెరవేర్చినట్టు అబద్దాలు చెబుతు న్నారని అందుకు ప్రత్యక్ష ఉదాహరణలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. విద్య రంగంలో కామన్ స్కూల్ విధానం అమలు, కేజీ టు పీజీ ఉచిత విద్య అందని ద్రాక్షగా మారిందని, ప్రభుత్వ పాఠశాలలు సబ్జెక్టు టీచర్ల కొరతతో తొమ్మిదేళ్లుగా దిగజారు తోందని తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక సొంతంగా ఒక్క డీఎస్సీ నిర్వహించని రాష్ట్ర ప్రభుత్వం వేలాది ఉపాధ్యాయ ఖాళీలను భర్తి చేయకపోవడం, కరోనా కంటే ముందు 25 వేల విద్యా వాలంటరీ పోస్టులు ఉంటే వాటిని రద్దు చేసి నేటికీ పునరుద్ధరించలేదని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు అయిన తర్వాత సుమారు 6 వేల పాఠశాలల మూసివేత వల్ల డ్రాపౌట్స్ పెరిగి విద్యారంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడు తుందని, . ప్రతి ఉన్నత పాఠశాలలో సగం సబ్జెక్టు టీచర్లు కూడా లేని దుస్థితి, నిరుద్యోగులకు ఇస్తా నన్న నిరుద్యోగ భృతి ఊసే లేదని తెలిపారు. దళితు లకు మూడెకరాల భూమి, బడుగు బలహీన వర్గాల కు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇంటింటికి మంచినీటి సరఫరా, రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ, గిరిజన ఆదివాసుల బిడ్డలకు పోడు భూములపై పట్టాలు, ధరణిలో లోపాలను సవరించకపోవడం వల్ల లక్షల రైతులు తమ భూములు తమరివిగా చెప్పుకోలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల ఇటీవల పంట నష్టంపై ప్రకటించిన పదివేల రూపాయలు నేటికీ ఏ ఒక్క రైతుకు ఇవ్వకపోవడం, ధాన్యాన్ని కొనే దిక్కు లేక రోడ్లమీద ధాన్యాన్ని రైతులు పారపోసి నిరసన వ్యక్తం చేయడం, రైతులకు గతంలో అందించే ఇన్‌పుట్ సబ్సిడీ, సబ్సిడీ ఎరువులు విత్తనాలు, గిట్టుబాటు ధర అందని పరిస్థితి నెలకొందని తెలిపారు. పంటను మార్కెట్లో అమ్ముకోలేని రైతులు గిట్టుబాటు ధర పొందక పంటలకు నీటి వసతి లేక చేసిన అప్పులను తీర్చలేక ఈ తొమ్మిదేళ్ల కాలంలో వేలాది మంది రైతులు ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అర్హులైన లక్షలాది నిరుపేదలకు తొమ్మిదేళ్లుగా రేషన్ కార్డులు పంపిణీ చేయకపోవడం, వితంతు, వృద్ధాప్య, ఒంటరి మహిళలు పింఛన్లకోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు హామీఇచ్చిన మేరకు తక్షణమే ఉత్తర్వులు వెలువరించి ఎన్నికలకు ముందే హామీలను నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ పక్షాన విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొన్నారు. లేని యెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రైల్వే శాఖ మంత్రి బాధ్యత వహించి రాజీనామా చేయాలి

సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డిమాండ్

నవతెలంగాణ ఆర్మూర్

ఒడిశా రైలు ప్రమాదానికి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. పట్టణంలోని మామిడిపల్లి భగత్ సింగ్ విగ్రహం వద్ద ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ప్రజల ప్రాణాల పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నశించాలి అంటూ నినాదాలు చేశారు. ఈ ప్రదర్శనలో న్యూ డెమోక్రసీ నాయకులు దాసు, శివాజీ మాట్లాడుతూ, ముందుగా మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైలు ప్రమాదంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించా లని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారాన్ని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రైల్వే శాఖలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేసి, కార్మికులపై పని ఒత్తిడి భారాన్ని తగ్గించాలని, రైల్వే లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటికరణ ఆపి, ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలని వారు నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి బి సూర్య శివాజీ, డివిజన్ పిడిఎస్యు అధ్యక్షులు బి. ప్రిన్స్, మండల పి వై ఎల్ కమిటీ అధ్యక్షులు అధ్యక్షులుఎస్ వెంకటేష్, ఆజీం, ఐఎఫ్‌టీయూ నాయకులు మగ్దుమ్ పటేల్, వైకుంఠం, శివకుమార్, భానుచందర్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

అ'పూర్వ' సమ్మేళనం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మోస్రా మండలంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. యోగక్షేమాలను తెలుసుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.



రైతులు సమస్యల్లో ఉంటే దశాబ్ది ఉత్సవాలా..?


ఇంకా ధాన్యం కొనుగోలు పూర్తికాలే

రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించలేదు

కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి

నవతెలంగాణ-మోపాల్

తెలంగాణ రాష్ట్రంలో 105 కోట్ల రూపాయలుపెట్టి దశబ్ద ఉత్సవాలు జరపాల్సిన అవసరమేముందని కిసాన్‌ఖేత్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ధాన్యం కొనుగోలు చేసినవారు లేరని, కర్షకులు కష్టాల్లో ఉంటే ప్రభుత్వం మాత్రం దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ వారి పొట్టగొడుతున్నారని అన్నారు. రుణమాఫీ చేయని కేసీఆర్ ఏ ముఖం పెట్టుకొని దశబ్ద ఉత్సవాల్లో రైతు వేదికల్లో ప్రగల్బాలు పలుకుతున్నారని ప్రశ్నించారు. కనీసం ధాన్యం ఇంకా కొనుగోలు చేయకపోవడంతో ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ కర్షకులు దీనావస్థలో ఉన్నారని, కనీసం కొనుగోలు చేసిన వడ్ల డబ్బులు కూడా ఇంకా వారి ఖాతాలో జమ చేయాలని అన్నారు. ఖరీఫ్ సీజన్‌కు రైతులు విత్తనాలు కొనుగోలు చేద్దామనుకుంటే చేతిలో చిల్లిగవ్వ కూడా లేకుండా చేశారన్నారు. ఇప్పటికైనా రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించాలని, అకాల వర్షంతో వడగళ్ల వానకు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు కళ్లల్లో ఆనందం చూసిన తర్వాతే రైతు వేదికలో సంబరాలు చేయాలని అన్నారు. ఇంకో ఆరు నెలల్లో ఈ ప్రభుత్వం పీడ విరగడైపోతుందని, వచ్చేది కర్షక ప్రభుత్వమని, రైతుల ప్రభుత్వమని ఆయన పేర్కొన్నారు. దాదాపు200 కోట్ల రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం చేసి ప్రకటనలకు ఇవ్వడం ఎంత దౌర్భాగ్యమని అన్నారు. ఇన్ని సంవత్సరాలు ఏ ప్రభుత్వం కూడా ఇలా ప్రజాధనం దుర్వినియోగం చేయలేదని, ఆ ప్రకటనకు ఇచ్చే డబ్బులను రైతులకు ఇచ్చి ఉంటే అది అసలు సిసలైన రైతు ప్రభుత్వమని ఆయన అన్నారు, ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ 90 శాతం కాళేశ్వరం 20 21 పనులు పూర్తయ్యాయని చెప్పారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలిద్దామని తెలిపారు. ఇప్పటికైనా నిజాలు మాట్లాడాలని ప్రజలకు అబద్దాలు చెప్పి మభ్యపెట్టొద్దని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిన తర్వాతనే ప్రజల మధ్యలో తిరుగుతామని, ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కడం కాదని నిజాలు చెప్పి ప్రజల అవసరాలను తీర్చే వారే నిజమైన నాయకులని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వడగళ్ల వానకు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం చెల్లిస్తూ ఇంకా కళ్లల్లో ఉన్న వడ్లను తొందరగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



విద్యుత్ విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయండి

- జుక్కల్ ట్రాన్స్‌కో ఏఈ నరేందర్

నవతెలంగాణ-జుక్కల్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం జుక్కల్ నియోజకవర్గంలోని ఆరుమండలాలు కలిసి బిచ్కుందలోని బండయప్పా ఫంక్షన్‌హాల్‌లో విద్యుత్ విజయోత్సవ ర్యాలీని నిర్వహించనున్నట్టు జుక్కల్ ట్రాన్స్‌కో ఏఈ నరేందర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే హన్మంత్ షిండే, పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్ హాజరు కానున్నారని, కావున జుక్కల్ మండలంలోని గ్రామ, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారులు తప్పక రావాలని, ఉత్సవాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

బాణాపూర్‌లో గ్రామ దేవతలకు బోనాలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని బానాపూర్ గ్రామంలో ఆదివారం గ్రామదేవతలకు బోనాలు తీసి మొక్కలు తీర్చుకున్నారు. డప్పు సప్పుళ్ల, పోతరాజుల విన్యాసాలతో బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.



బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని మైథిలీ ఫంక్షన్ హాల్‌లో 1997-1998 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గంగారం, కె.రామారావు, దయానంద్, నరేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్ ధౌలే కూతురైన డి.శివాని పదవ తరగతి 2023లో 10/10 మార్కులు సాధించిన సందర్భంగా ఉపాధ్యాయుల చేత సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో గల పైడాకుల వార్ సత్యవ్వ ఇటీవల అకస్మాత్తుగా మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే హనుమంతు షిండే ఆదివారం పరామర్శించారు. సత్యవ్వ మృతి గురించి ఎమ్మెల్యే ఆమె కుమారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మద్నూర్ సర్పంచ్ సురేష్, రైతు సమన్వయ సమితి కన్వీనర్ కంచిన్ హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు సన్మానం..

మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ధ్యాపూర్వార్ సంతోష్ కూతురి పుట్టు ఒల్లెల శుభ కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే కుటుంబ సభ్యులతో హాజరుకాగా.. శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేతో పాటు సర్పంచ్ సురేష్‌కు కూడా శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ హనుమాన్లు, రైతు సమన్వయ సమితి కన్వీనర్ కంచి హనుమాన్లు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ యువ నాయకులు తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

- మండల విద్యాధికారి రామస్వామి



ప్రభుత్వ పాఠశాల విద్యను వివరిస్తున్న ఎంఈవో

నవతెలంగాణ-లింగంపేట్

ఆరు నుంచి 14 సంవత్సరాల లోపు పిల్లలు బడిలో ఉండాలని మండల విద్యాధికారి రామస్వామి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా ఆదివారం లింగంపేట్ మండలంలోని బూరుగిద్ద గ్రామంలో విద్యార్థుల ఇండ్ల వద్దకు వెళ్లి విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. పాఠశాలలో చేర్పించుకున్న విద్యార్థుల వివరాలను ఐఎస్ఎంఎస్ పొందుపరచాలని ఆయన పేర్కొన్నారు. బడి మానేసిన పిల్లలు పనిలో పెట్టుకోవద్దన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు దుస్తులు, సన్నబియ్యం ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. ఆయన వెంట సీఆర్పీలు విజయ్, సంజీవ్, ఉపాధ్యాయురాలు ప్రీతి తదితరులున్నారు.

ఘనంగా గంగమ్మ ఆలయం వార్షికోత్సవ వేడుకలు



పూజలు చేస్తున్న పలువురు

నవతెలంగాణ-బోధన్

సాలురా మండలంలోని కామక్య చెరువు కట్టపై గల గంగమ్మ దేవి ఆలయం 12వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బుద్దె సావిత్రి ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బుద్దె రాజేశ్వర్, కేజీ గంగారం, వెంకట్ పటేల్, సురేష్‌పటేల్, గంగపుత్ర సంఘం ప్రతినిధులు గౌరాజీ, భూమయ్య, సాయిలు, గంగారం, దత్తు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోల్కంపేటలో ఎడ్లబండ్ల ప్రదర్శన



ఎడ్లబండ్ల ప్రదర్శనలో గ్రామస్తులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోల్కంపేట గ్రామంలో ఆదివారం గ్రామదేవతల వద్ద ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. జాతర ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు గ్రామ దేవతలైన బూర్గుల పోచమ్మ, నల్ల పోచమ్మ, మహాగణపతి, పోలేరమ్మకు ఎడ్లబండ్లను అలంకరించి డప్పు సప్పులతో గ్రామ దేవతల ఆలయాల చెట్టు ఐదుసార్లు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షేమ సంబురాలను విజయవంతం చేయాలి

- 9న నసురుల్లాబాద్‌కు స్పీకర్ రాక
- డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 9న నసురుల్లాబాద్ మండలంలో నిర్వహిస్తున్న సంక్షేమ సంబురాల్లో రాష్ట్ర శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వస్తున్నారని, సంక్షేమ సంబరాలను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 9న నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సంక్షేమ సంబరాల్లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాక సందర్భంగా ఆదివారం నసురుల్లాబాద్ మండలంలోని రైతు వేదికలో నసురుల్లాబాద్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల ప్రజాప్రతినిధులతో కలిసి సభ స్థలాన్ని పరిశీలించారు. నసురుల్లాబాద్ మండలంలోని అన్ని గ్రామాలకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాల లబ్దిదారులను సభకు తరలివచ్చేలా చూడాలని, భారీ బహిరంగ సభకు లబ్దిదారులను భారీ ఎత్తున తరలించడానికి చెయ్యవలసిన ఏర్పాట్ల గురించి ప్రజాప్రతినిధులతో చర్చించారు. లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి కలిసి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి అందరినీ సభకు వచ్చేలా కృషి చేసి సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెరిక శ్రీనివాస్, ఎంపీపీ పాల్త్య విఠల్, సొసైటీ చైర్మన్‌లు మారుతి పటేల్, గంగారం, వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ ఫోరం కన్వీనర్ రాము, మాజీ జెడ్పీటీసీ కిషోర్ యాదవ్, నాయకులు కంది మల్లేష్, మైషాగౌడ్, సాయిలు యాదవ్, మహేష్, గిర్మయ్, ప్రతాప్‌సింగ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి

విపక్షాలను బంధించి దశాబ్ది ఉత్సవాలా..?

- ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ డల్లా సురేష్

నవతెలంగాణ-ఎడపల్లి

పోరాడి సాధించుకున్న తెలంగాణలో విపక్షాలను పోలీసుస్టేషన్లో బంధించి తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం సిగ్గుమాలిన చర్య అని సామాజిక తెలంగాణ మహాజన ఉద్యమ కారులు, ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ డల్లా సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సీఎం కేసీఆర్ నిర్మల్ జిల్లాలో పర్యటన ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎడపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు మహా జన సోషలిస్ట్ పార్టీ నాయకులను ఎడపల్లి పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ డల్లా సురేష్ మాట్లాడారు. రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయలేని సీఎం కేసీఆర్.. గ్రామాల్లో రైతువేదిక వద్ద తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు చేయడం రైతులను పిలిచి రైతులకు జరిగిన లాభనష్టాల గురించి మాట్లాడించిన దాఖలు లేవని ఆయన గుర్తు చేశారు. కేవలం ప్రజాప్రతినిధులకు మాత్రమే అధికారులు గౌరవం ఇచ్చారు తప్పా రైతులకు అన్యాయం జరిగిందన్నారు. రైతు పండించిన పంటకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, డబ్బులు ధాన్యం అమ్మిన డబ్బుల ఇంతవరకు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆయన అన్నారు. రాష్ట్ర అవతరణ శతాబ్ది ఉత్సవాల పేరిట వందల కోట్ల బడ్జెట్‌ను విడుదల చేశారంటే ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మారుస్తున్న కేసీఆర్‌ను చూస్తుంటే కాళోజీ మాటలు గుర్తుకు వస్తున్నాయని ఆయన అన్నారు. తెలంగాణకు తెలంగాణేతరుడు మోసం చేస్తే తెలంగాణ బార్డర్ వరకు తరిమి కొట్టాలని, అదే సమయంలో తెలంగాణోడు మోసం చేస్తే తెలంగాణలోనే పాతి పెట్టాలని తెలంగాణ పోరాటంలో చెప్పిన ఈ నినాదం తెలంగాణ ప్రజలందరూ తక్షణమే స్వీకరించి కేసీఆర్ కుటుంబ నియంత పాలనకు చరమగీతం పాడాల్సిందేనని తెలిపారు. మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు, అంబం వై మాజీ ఉపసర్పంచ్ సున్నపు వడ్డెన్న, నాయకులు బుడ్డ పోశెట్టి, హరిదాస్, ప్రకాష్, రవికుమార్ తదితరులు అరెస్టు అయిన వారిలో ఉన్నారు. అనంతరం ఎడపల్లి పోలీసులు సొంత పూచీకత్తుపై అరెస్టు చేసిన వారిని విడుదల చేశారు.



మాట్లాడుతున్న డల్లా సురేష్

ఎమ్మెల్యే ఆదేశాలతో ఈద్గా వద్ద బోరు తవ్వకం

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆదేశాలతో స్థానిక ఈద్గా వద్ద బోరు బావి తవ్వకం పనులను ఆదివారం బీఆర్ఎస్ నాయకులు నీలుపటేల్ ప్రారంభించారని, అలాగే మైబాపూర్ గ్రామంలో సర్పంచ్ సంజీవ్‌రాథోడ్ ఆధ్వర్యంలో బోరు తవ్వకం పనులు ప్రారంభించినట్టు విండో మాజీ చైర్మెన్ రాజుపటేల్ తెలిపారు. ఈ సందర్భంగా నాయకుడు నీలుపటేల్ మాట్లాడుతూ.. మైనార్టీ సోదరుల కోరిక మేరకు ఈద్గా వద్ద బోరు తవ్వాలని కోరడంతో ఎమ్మెల్యే తవ్విస్తానని హామీ ఇచ్చారని ఆయ నకు ముస్లిం, మైనార్టీలు అభినం దనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీవిండో చైర్మెన్ రాజుపటేల్, మాజీ సర్పంచ్ బొల్లి గంగాధర్, మైనార్టీ అధ్యక్షుడు శాదుల్, మాజీ మార్కెట్ డైరెక్టర్ మైబు, మాజీ ఎంపీటీసీ ఇమ్రాన్, మాజీ కోఆప్షన్ మెంబర్ బాబా జావేద్, జాఫర్, హైదర్, ఖాసీమ్, బీఆర్ఎస్ నాయకుడు నీలుపటేల్, బైబాపూర్ శంకర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



బోరు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

వైఎస్ఆర్‌టీపీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- 250 మందికి వైద్య పరీక్షలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోతాయిపల్లి, కోమటిపల్లి గ్రామాల్లో వైఎస్ఆర్‌టీపీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు ఎల్లారెడ్డి కోఆర్డినేటర్ జమున రాథోడ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 250 మందికిపైగా రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో కోమటిపల్లి, పోతాయిపల్లి, అన్నారెడ్డిపల్లి, కేసిపేట గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సుమారు 250 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. షుగర్, బీపీ, హార్ట్ పేషెంట్స్‌లను ప్రత్యేకంగా చూశారు. ఈ సందర్భంగా డాక్టర్ జమున వెంకట రాథోడ్ మాట్లాడుతూ.. పేదలకు మంచి వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారు ఆందోళన చెందవద్దని అండగా ఉంటానన్నారు. అధైర్య పడవద్దని అన్నారు. మెరుగైన వైద్య చికిత్సలందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంతోష్, అల్లూరి జైపాల్, నందు, రామలింగం, సిద్దు గ్రామస్తులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉత్తమ పాలనకు.. కొత్త మండలాలు..

- నిజామాబాద్ జిల్లాలో ఇటీవలే నాలుగు ఏర్పాటు

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన అనంతరం రాష్ట్రంలో పలు జిల్లాలలో మరింత ఉత్తమ పాలన అందించడానికి కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో బోధన్ నియోజకవర్గంలోని సాలూర మండలం, ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆలూర్, నందిపేట్ మండలంలోని డొంకేశ్వర్, కోటగిరి మండలంలోని పోతంగల్‌ను నూతన మండలాలుగా ఏర్పాటు చేసింది. దాంతో ప్రజలకు మరిన్ని నాణ్యమైన సేవలు అందించ డానికి ప్రభుత్వం నడుం బిగించింది. జిల్లాలో బోధన్, నందిపేట్ పెద్ద మండలం కావడంతో ప్రజలు వారి సొంత పనులపై కార్యాలయాలకు రావడానికి ఇబ్బందులు పడేవారు. ఒక్కొక్క పనికి వారాల తరబడి రాకపోకలు సాగించేవారు. అధికారులు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కొత్త మండలాలు ఏర్పాటు చేసింది.

తెలంగాణ ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసిన అనంతరం ముందుగా తహసీ ల్దార్ కార్యాలయాలను ప్రారంభించింది. మండ లానికి సంబంధించిన ప్రధానంగా రెవెన్యూ రికార్డులను విభజించి గ్రామాల వారీగా దస్త్రాలను వేరు చేసింది. దాంతో కొత్త మండ లాల్లో రెవెన్యూకు సంబంధించిన భూ సంబంధ పరిష్కారాలు, భూముల రిజిస్ట్రేషన్లు జరుగు తున్నాయి. అలాగే విద్యార్థులకు సంబంధించిన దినపత్రికలు సకాలంలో అందిస్తున్నారు. మరిన్ని ప్రభుత్వ శాఖలను ఏర్పాటు చేస్తే మరింత సౌకర్యవంతంగా ఉంటుంది.

ఆయా కొత్త మండలాల్లో మరిన్ని ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అధికారులు స్థలాల పరిశీలన చేయడం, ప్రస్తుతం అనుకూలమైన భవనాల కోసం పరిశీలిస్తున్నారు. కొత్తగా మండలాలు ఏర్పడిన ప్రాంతాలలో వ్యాపార వాణిజ్యపరంగా అభివృద్ధి సాధించ వలసి ఉంటుంది. దాంతో భూముల ధరలు పెరుగుతాయి. అలాగే వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం ఎన్నికల సమీపిస్తున్న సందర్భంగా ప్రభుత్వం కొత్త మండలంలో మరిన్ని సౌకర్యాలు కల్పించాలి. దాంతో జనం రాకపోకలతో కొత్త మండలం కళకళలాడే అవకాశం ఉంటుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కొత్త మండలాల్లో జరిగే అవకాశం ఉండడంతో ఇప్పటి నుంచే ఎంపీపీ, జడ్పీటీసీ పదవుల కోసం ఆశావాహులు ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు.



సాలూరలో ఏర్పాటు చేసిన తహసీల్దార్ కార్యాలయం



సాలూర మండల ముఖచిత్రం

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహేందర్‌రెడ్డి తండ్రి గత వారం రోజుల క్రితం అకాల మరణం చెందడంతో, అలాగే తగ్గెల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అంబదాస్, దేవేందర్ తల్లి అనారోగ్యంతో మరణించినందున ఆదివారం బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గిర్ధవర్ గంగారెడ్డి, బుద్దె రాజేశ్వర్, జీ.నర్సయ్య, పీ.రవికిరణ్, సాలూర షకీల్, సర్పంచ్‌లు కోర్వ గంగాధర్, ఎంపీటీసీ ప్రభాకర్ కార్యకర్తలు నాయకులు ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఏడవ వార్డులో జోషి శ్రీధర్ అనే వ్యక్తి ఇంటి పై కప్పుపై ఆదివారం మధ్యాహ్నం రేకులు అమరుస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగాయి. ఇంటి వెనుక భాగం కొంతమేర కాలిపోయింది. స్థానికులు గమనించి అందుబాటులో ఉన్న మున్సిపల్ వాటర్ ట్యాంకర్‌తో స్థానికులు ఇంటిపై ఎగిసిపడుతున్న మంటలను ఆర్పివేశారు. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు కాలిపోయినట్లు బాధితులు జోషి శ్రీధర్ తెలిపారు.



కాలిపోయిన వస్తువులు

గాంధారిలో బోనాలు



బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామదేవతలకు మహిళలు బోనాలు సమర్పించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే వర్షాకాలం ప్రారంభంలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని ఈ సంవత్సరం మంచి వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని గ్రామ దేవతల కోరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్ర నాటక చరిత్ర ప్రదర్శన విజయవంతం చేయాలి

నవతెలంగాణ-తాడ్వాయి

శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి నాటక చరిత్రను మండలంలోని కరడ్‌పల్లి గ్రామంలో శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి నాటక చరిత్రను ప్రదర్శిస్తున్నారని నాటక సభ్యులు తెలిపారు. 5, 6, 7 తేదీల్లో మూడు రోజుల పాటు నాటకాన్ని ప్రదర్శిస్తున్నామని పేర్కొన్నారు. మండలంలోని వారే కాక ఇతర గ్రామాల నుంచి వచ్చి వీక్షించాలని వారు తెలిపారు.

సీఎం కేసీఆర్ కాన్వాయ్ పై పూలవర్షం



పూల వర్షం కురిపిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

నిర్మల్ జిల్లా కేంద్రంలో నూతన సమీకృత కలెక్టరేట్‌ను ఆదివారం రోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంలో సీఎం కేసీఆర్ కాన్వాయ్ ముప్కాల్ మండల కేంద్రం మీదుగా 44వ జాతీయ రహదారి (బైపాస్) పై నుంచి నిర్మల్ జిల్లాకు వెళ్తున్న వేళ జాతీయ రహదారిపై ముప్కాల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీఎం కాన్వాయ్‌పై పూల వర్షం కురిపించారు. ఎల్లపల్లి శివారులో దాదాపు రూ. 56 కోట్లతో నిర్మించిన కలెక్టరేట్ భవన సముదాయంతో పాటు కొండాపూర్ బైపాస్ వద్ద బీఆర్ఎస్ పార్టీ భవనాన్ని సైతం ప్రారంభించారు. కార్యక్రమంలో ముప్కాల్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, జడ్పీటిసి సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, టౌన్ అధ్యక్షులు పెంటు గంగాధర్, సర్పంచులు, ఎంపీటీసీలు, కో అప్షన్ సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆలోచించి ఆచరించు
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
4
సోమవారం 05 జూన్ 2023

నేడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్న భూపతిరెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని నేడు సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభించటానికి తెలంగాణ ఉద్యమ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ భూపతి రెడ్డి వస్తున్నట్లు పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బంగ్లా వసంతరావు ఆదివారం తెలిపారు. యువజన సంఘ విభాగం, కాంగ్రెస్ అభిమానులు, కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు.

శ్రీ ఓం దేవి ఆలయాన్ని దర్శించిన బిజెపి మాజీ జాతీయ కార్యదర్శి



నవతెలంగాణ-నవీపేట్

భారతీయ జనతా పార్టీ మాజీ జాతీయ కార్యదర్శి మురళీధర్ రావు ఆదివారం మండలంలోని యంచలో గల శ్రీ ఓం దేవి ఆలయాన్ని సందర్శించారు. గోదావరి హారతి యాత్రలో భాగంగా బిజెపి, ఆర్ఎస్ఎస్ నాయకులతో కలిసి ఆలయంలోని అమ్మవారిని దర్శించుకున్నారు. గోదావరి నది తీరంలో సుందరమైన ఆలయాన్ని నిర్మించి భక్తులకు విశేష సేవలు అందిస్తున్న అమ్మవారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇందూర్ హరీష్, సర్పంచ్ ప్రవీణ్ కుమార్, తదితరులున్నారు.

భూనిర్వాసితుల పోరాటానికి సంపూర్ణ మద్దతు

- **బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**
- **మంచిప్ప రిజర్వాయర్ ప్రాజెక్టు పనులు పరిశీలన**



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్



ప్రాజెక్టును పరిశీలిస్తున్న ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-మోపాల్

భూ నిర్వాసితుల పోరాటానికి బీఎస్పీ సంపూర్ణ మద్దతు ఉంటుందని, పోరాటం చేసిన వ్యక్తులపై హత్యాయత్నం కేసు పెట్టడం చాలా దారుణం అని డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం మంచిప్ప రిజర్వాయర్ ప్రాజెక్టు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. రీ డిజైన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ముంపు గ్రామాల నిర్వాసితుల కమిటీ చేపడుతున్న ఉద్యమానికి ఆయన మద్దతు పలికారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మంచిప్ప ప్రాజెక్ట్ రీడిజైన్‌వల్ల వేలాది గిరిజన కుటుంబాలు భూ నిర్వాసితులుగా మారుతున్నాయని, తక్షణమే రీడిజైన్ రద్దు చేసి, పాత డిజైన్ ప్రకారం ప్రాజెక్ట్ నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిప్ప రిజర్వాయర్ వల్ల 8 తండాలు, 2 గ్రామపంచాయతీలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. కేసీఆర్ స్వార్థానికి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ బలి అయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రాజెక్టు రీ డిజైన్ వల్ల 4 వేల కుటుంబాలు రోడ్డు పడుతున్నాయన్నారు. ప్రాజెక్టు రీ డిజైన్ కేవలం కాంట్రాక్టర్లు, కమిషన్ల కోసమే చేపట్టారన్నారు. తరాతరాలుగా భూమిని నమ్ముకొని బతుకుతున్న వందలాది మంది రైతులు తమ వ్యవసాయ భూములు, బంజారాలు అటవీ భూములను కోల్పోతున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా 21, 22వ ప్యాకేజీలను పాత డిజైన్ ప్రకారమే నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొమ్మిది ఏళ్లైనా 21వ ప్యాకేజీ పనులు ఎందుకు పూర్తి చేయలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే పాత డిజైన్ ప్రకారం ప్రాజెక్టు పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. భూములు కోల్పోయిన రైతులు నిరసన తెలిపితే హత్యాయత్నం కేసులు పెట్టి జైలుకు పంపారు. కేసీఆర్‌కున్న 300 ఎకరాల ఫామ్ హౌస్‌ను ప్రాజెక్టుల పేరుతో గుంజుకుంటే ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే మంచిప్పరిజర్వాయర్ రీడిజైన్ వెనక్కి తీసుకోవాలి.నిర్వాసితులపై పెట్టిన అక్రమ కేసులను ప్రభుత్వం బేషరతుగా ఉపసంహరించుకోవలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంచిప్ప, బైరాపూర్, అమ్రాబాద్ తండాల ప్రజలు గత ఏడు సంవత్సరాలుగా ఈ తెలంగాణ ప్రభుత్వం రైతు, గిరిజన వ్యతిరేక దోపిడీ దౌర్జన్యాలపై పోరాటం చేస్తున్న ఈ గిరిజన బిడ్డలు, రైతు బిడ్డలందరికీ మద్దతుగా సంఘీభావంగా నిలవడం కోసం వచ్చానన్నారు. చెరువు దాదాపు ఒక్క టీఎంసీ నీటి కోసం డిజైన్ చేసినప్పుడు బడ్జెట్ కేవలం 1100 కోట్లు మాత్రమే కానీ కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇదంతా రీ డిజైన్‌గా మార్చి ఆయకట్టును పెంచి దీనిని 3.5 టిఎంసిల అదనపు నీటీ కోసం చేస్తున్నామని మాయ మాటలు చెప్పారన్నారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం కేవలం కమిషన్ల కోసం మాత్రమే ఈ ప్రాజెక్టు డిజైన్ మార్చి 1100 కోట్ల నుండి 3000 కోట్ల రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. దీనివల్ల 1400 ఎకరాల పట్టా భూమి 800 ఎకరాల అడవి భూమి అదేవిధంగా 9 తండాల ప్రజలు భూమిని నమ్ముకున్న ప్రజలు, గిరిజన బిడ్డలకు అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భూమి కోల్పోయిన ప్రజలు రేపు నిజామాబాద్ పట్టణంలో అడ్డా కూలీలుగా తమ జీవనం కొనసాగిస్తారని ఆయన అన్నారు. ఇటువంటి దౌర్భాగ్య పరిస్థితి తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణ బిడ్డలకు జరుగుతుందని ఏ రోజు కూడా అనుకోలేదని వాపోయారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే రీ డిజైనింగ్ రద్దు చేస్తామని గ్రామ ప్రజలకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని, వాళ్ళ కోసం ప్రాణాలు ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నానని తెలిపారు. మంచిప్ప ముంపు గ్రామాల రైతులకు న్యాయం జరిగేంత వరకూ నిర్వాసితుల పక్షాన బీఎస్పీ అండగా పోరాడుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలోభూనిర్వాసిత పోరాట కమిటీ గౌరవ అధ్యక్షులు దేవశంకర్ నాయక్, కమిటీ సభ్యులు తూర్పురాజేష్ పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న శ్రీకృష్ణ యాదవసంఘం సభ్యులు

నవతెలంగాణ-ముప్కాల్

శ్రీ కృష్ణ యాదవ యూత్ ఆధ్వర్యంలో మండలంలోని వేంపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకోసం ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జక్క మల్లుబాయి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జక్క గంగాధర్, వేంపల్లి సొసైటీ ఛైర్మన్ జక్క రాజేశ్వర్, వార్డ్ సభ్యులు, శ్రీ కృష్ణ యాదవ సంఘ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు, యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోనా సముందర్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనా సముందర్ గ్రామంలో ఆదివారం జగిత్యాల జిల్లా మెట్ పల్లికి చెందిన శ్రీహరి న్యూరో హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను శ్రీహరి న్యూరో హాస్పిటల్ డాక్టర్ అవినాష్ కుమార్ పరీక్షించారు. సుమారు 350 మంది రోగులను పరీక్షించి, ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజ్మెంట్ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడానికి సంహరించిన సర్పంచ్ ఇంద్రాల రూప రాజేందర్, ఉపసర్పంచ్ పేరం లింబాద్రి, ఎంపీటీసీ సభ్యుడు కాలేరు శేఖర్ లకు హాస్పిటల్ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మానేజ్మెంట్ సభ్యులు గంగాధర్, శ్రీనివాస్, కృష్ణా, రాము, ప్రశాంత్, సిబ్బంది శేఖర్, శంకర్, నారాయణ, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా రైలు ప్రమాద బాధితులను ఆదుకోవాలి

- **బీసీ రాష్ట్ర మహిళా కార్యదర్శి అరుణ జ్యోతి**



అరుణ జ్యోతి

నవతెలంగాణ-ఆర్మూర్

ఒడిశా రైలు ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలంగాణ బిసి రాష్ట్ర మహిళా కార్యదర్శి అరుణ జ్యోతి ఆదివారం తెలిపారు. రైలు ప్రమాదం అత్యంత బాధాకరమని, రైలు ప్రమాదంలో మృతి చెందిన ప్రయాణికులను ఆదుకోవాలని, అలాగే మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయడం క్షతగాత్రులను ఆస్పత్రి వద్ద పరామర్శించడం చనిపోయిన మృత దేహాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించడం సాధారణంగా మారుతుందే తప్ప ప్రమాదాల నివారణకు గట్టి చర్యలు తీసుకోవడంలో లోపం కనబడుతోందని అన్నారు. వివిధ రాష్ట్రాలకి చెందిన వందలాదిమందికిపైగా మృతి చెందినట్లు వార్తలు బాధ కలిగిస్తున్నాయని మృతులకు సంతాపం వారి కుటుంబ సభ్యులకు ప్రఘాడ సానుభూతిని వ్యక్తం చే శారు. భవిష్యత్తులో రైలు ప్రమా దాలు జర గకుండా కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని ఆ ఎ ె సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే బిగాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల 35 మంది బాధితులకు 17లక్షలా 21వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. నిజామాబాద్ నగర ప్రజలు అత్యవసర సమయాల్లో ప్రయివేటు హాస్పటల్ లో చికిత్స పొందితే సంబంధిత బిల్లులతో తమ కార్యాలయంలో సి ఎం ఆర్ ఎఫ్‌కు దరఖాస్తు చేసుకొంటే వీలయినంత సహాయాన్ని ప్రభుత్వం ద్వారా అందిస్తామమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్ , నుడ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్ ఠాకూర్, సూదం రవి చందర్, సత్య ప్రకాష్ బీఆర్ ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక సదుపాయాలతో వైకుంఠధామాలు

- **ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త**



వైకుంఠధామం పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆధునిక సదుపాయాలతో వైకుంఠధామాలను నిజామాబాద్ నగరంలో నిర్మిస్తున్నామని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే విగల గణేష్ గుప్తా అన్నారు. అర్సపల్లి, దుబ్బ వైకుంఠ ధామాల పనులు ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల్లో ఎలాంటి అవకతవకలు ఉండద్దని, సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఒకవేళ ఏదైనా తప్పులు జరిగితే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిత్ర మిశ్రా, మున్సిపల్ డిఈ ఆనంద్ సాగర్, పబ్లిక్ హెల్త్ డిఈ మురళి, ఆర్అండ్‌బి డిఈ ప్రవీణ్, గార్డెన్ శ్రీనివాస్, చందు, శ్యామ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మేరు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలోని మేరు భవనం ఆదర్శ్ నగర్‌లో ఎంఈడబ్ల్యుఏ మేరు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఆదివారం అందజేశారు. ఈకార్యక్రమానికి మేవ అధ్యక్షులు కీర్తి సుదర్శన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మేరు సంఘం జిల్లా అధ్యక్షులు సోమ హన్మంతరావు హాజరయ్యారు. ఈసందర్భంగా కీర్తి సుదర్శన్ మాట్లాడుతూ మేరు విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత పదవులు పొంది తద్వారా వారి కుటుంబాల కోసం, సమాజం కోసం, దేశం కోసం పనిచేయాలని కోరారు. ముఖ్య అతిథిగా హాజరైన సోమ హన్మంతరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన, ఏకాగ్రత ఈ మూడు అంశాలు పాటిస్తూ.. కష్టంతో కాకుండా ఇష్టంతో చదవి ఉన్నస్థితి నిండి ఉన్నత స్థితికి చేరాలని కోరారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా పోల్కం గంగాకిషన్ , జిల్లా కార్యదర్శి దేవదాస్, కోశాధికారి చంద్రకాంత్, నగర అధ్యక్షులు మంతెన దశరథ్, కార్యదర్శి బుర్ర అశోక్, కోశాధికారి యేన్ను సుదర్శన్, ఉపాధ్యక్షులు గట్ల సత్యం, సంయుక్త కార్యదర్శి మాడిషెట్టి లక్ష్మణ్, మేవ మాజీ అధ్యక్షులు రెబ్బ ఆనంద్, కార్యదర్శి దర్వస్తు గంగాధర్,కోశాధికారి రాజుల్ దేవ్ భాస్కర్ ,అనిల్ ప్రసాద్,బుర్ర సాయిబాబా, కొట్టూర్ శ్రీనివాస్, కర్నే శ్రీనివాస,ఏన్ను సూర్యప్రకాష్, హాజరయ్యారు. 6 వ, తరగతి నుండి 10,వ,తరగతి వరకు సుమారు 250 మంది విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.

ఆర్యవైశ్య ఫంక్షన్ హాలుకు భూమి కేటాయించిన ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో ఆర్య వైశ్య సామాజిక వర్గానికి ప్రత్యేకంగా ఫంక్షన్ హాలు నిర్మించడానికి 15వందల గజాల భూమిని కేటాయిస్తున్నట్లు పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి ప్రకటించారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సామాజిక వర్గం ప్రతినిధులు ఆదివారం జీవన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా వారు తమకు ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని, నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జీవన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దీనిపై వెంటనే స్పందించిన జీవన్ రెడ్డి వారికి 1500 గజాల స్థలం, నిర్మాణానికి 25 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి ఆర్యవైశ్య సామాజికవర్గం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

జీవన్ రెడ్డిని కలిసిన వంజరి సంఘం సభ్యులు

నియోజకవర్గ వంజరి సంఘ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు వంజరి సంఘం కోసం చేపట్టిన ఫంక్షన్ హాలు నిర్మాణం గురించి చర్చించారు..

కౌన్సిలర్లకు పరామర్శ గంగామోహన్ ....

అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ గంగామోహన్ చక్రును ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి పరామర్శించారు. ఆదివారం ఆయన గంగామోహన్ చక్రు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని జీవన్ రెడ్డి ఆకాంశించారు. అలాగే మున్సిపల్ కౌన్సిలర్ రంగన్న అనారోగ్యంతో బాధ పడుతున్నారని తెలుసుకొని జీవన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి ఇంటికి కూడా వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు పండిత్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులను వెంటనే చెల్లించాలని

- **సిపిఐ డిమాండ్**



మాట్లాడుతున్న సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గత నెల 11వ తేదీ నుండి పిఎసిఎస్ ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. నిజామాబాద్‌నగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న పరిస్థితిలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాల్సిన తరుణంలో ప్రభుత్వం వద్ద డబ్బులు ఇవ్వకపోవడం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కావున ప్రభుత్వం వెంటనే రైతాంగానికి చెల్లించాల్సిన ధాన్యం డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు ఏ విటల్ గౌడ్, బి.రఘురాం పాల్గొన్నారు.

రామాలయం ట్రస్ట్ ద్వారా అంగన్వాడీ పాఠశాలకు కుర్చీల వితరణ



కుర్చీలు అందజేస్తున్న రామాలయ ట్రస్టు సభ్యులు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని తాళ్ల రామడుగు గ్రామ రామాలయ ట్రస్టు ద్వారా రామాలయ శాశ్వత కమిటీ ఛైర్మన్ బచ్చు పురుషోత్తం గుప్తా, వడ్డెర కాలనీ అంగన్వాడి ప్రాథమిక పాఠశాలలో పిల్లలకి కుర్చీలు, బీరువా, టేబుల్స్, అంగన్వాడి కుర్చీలు, ఫ్యాన్లు, ఆదివారం వితరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... నేటి బాలలే రేపటి పౌరులని, వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందని అన్నారు. తమ ట్రస్ట్ ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య జిల్లా కన్వీనర్ గన్నారం సవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జడ్పిటిసి మాలవత్ మాన్సింగ్ నాయక్, ఎంపీటీసీ ధర్రాజు గోవర్ధన్, మాజీ సొసైటీ ఛైర్మన్ ఇజాప గోపాల్, బండారి నరేష్, బి రవి ,వీడీసీ సభ్యులు, కాలనీవాసులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేద ప్రజలకు సేవలు అందించాలి



పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న లయన్ నివేదన్ గుజరాతి

నవతెలంగాణ-ఆర్మూర్

అనేక రకాల రోగాలతో బాధపడుతూ హాస్పిటల్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తూ నిరుపేద ప్రజలకు అతి తక్కువ ఫీజులు తీసుకొని వారికి తగిన సహాయం చేయాలని జిజి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతి అన్నారు. పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలో ఆదివారం ఆధ్యా పిల్లల హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లల వైద్య నిపుణులు ఆకుల అజయ్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్వ సమాజ్ అధ్యక్షులు ఆకుల రాజు, గుండు శ్రీనివాస్, ఆకుల గంగాధర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కాలనీ అభివృద్ధికి నిధులు




కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రతి ఆదివారం స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహిస్తూ ఆర్మూర్‌లో అందరికి ఆదర్శంగా నిలుస్తున్న జర్నలిస్ట్ కాలనీకి ప్రోత్సాహకంగా పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ప్రకటించారు. జర్నలిస్ట్ కాలనీలో ఆదివారం అభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఎమ్మెల్యే స్వయంగా చీపురు పట్టి రోడ్లను ఊడ్చారు. హనుమాన్ ఆలయం వద్ద కాలనీవాసులు శ్రమదానంతో శుభ్రం చేసిన రోడ్లను, పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రంగా మార్చిన పరిసరాలను ఆయన పరిశీలించారు. కాలనీ అభివద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటున్న కాలనీవాసులను ఎమ్మెల్యే అభినందించారు. కాలనీని అందంగా తీర్చిద్దుకుంటున్నారని, ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన ప్రశంసించారు. కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.25 లక్షలు, ఓపెన్ జిమ్ కోసం రూ.అయిదు లక్షలు, రెండు కల్వర్టులు, మురుగు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. వెంటనే ప్రతిపాదనలు రూపొందించి, పనులు చేపట్టడానికి టెండర్లు పిలవాలని పురపాలక కమిషనర్ ను ఆదేశించారు. జర్నలిస్టు కాలనీని పట్టణంలో ఆదర్శ కాలనీగా ప్రకటిస్తామని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తెలిపారు. తాను స్థానికంగా ఉన్నపుడు స్వచ్ఛ కాలనీ కార్యక్రమంలో పాల్గొంటానని ఆయన పేర్కొన్నారు. తమ కాలనీలో అభివద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ కతజ్ఞతలు తెలిపారు. తెరాస నాయకులు సంజయ్ సింగ్ బబ్లు, పండిట్ పవన్, లింబాద్రి గౌడ్, మహేష్, సాగర్, జర్నలిస్ట్ కాలనీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్ కుమార్, కాలనీ ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు కొక్కెర భూమన్న, సుంకే శ్రీనివాస్, కార్యదర్శులు కె.రాజు, రాజ్ కుమార్, సాయన్న, ఎస్సార్ఎస్పి డీఈ గణేష్, కాలనీ పెద్దలు గడ్డం శంకర్, ఎస్.గణపతి, ఎల్టీ కుమార్, భూమయ్య, నరహరి, జీవన్, మోహన్, భాజన్నతదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఆరుగురు విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-వేల్పూర్

ప్రాథమిక పాఠశాల పచ్చల నడుకుడ నుండి ఆరు విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అంకం నరేష్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులు ప్రణీత, లౌక్య, గమణ, వర్షిణి, శరణ్య విజ్ఞాన్‌ను గ్రామ సర్పంచ్ శ్వేత గంగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు అంకం నరేష్ అభినందించారు. మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలను అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింబగిరి స్వామి రాధా రాజేశ్వరి కష్ణవేణి అనూష విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.